


# గ్రీన్ రూం సింహప్రసాద్



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

**మొదటి రంగం:**

‘‘అదిగో మన నాగేంద్ర గారొస్తున్నారు...’’

రైతుబజారుకెళ్తోన్న నాగేంద్ర ఆ మాటలు విని అయిష్టంగా ఆగి ఆ గుంపు దగ్గరికెళ్ళాడు. కాలనీ లీడర్ విఠల్ తదితరుల్ని విష్ చేశాడు.

‘‘చూశావా నాగేంద్రా! మన జనం ఎంత మొద్దు నిద్ర పోతున్నారో! ఇవాళ మన ఎమ్మెల్యేగార్ని కలిసి మన కాలనీ సమస్యలు విన్నవిద్దామని మన కాలనీ వాట్సప్ గ్రూపులో మెస్సేజ్ మీద మెస్సేజ్ పెట్టానా లేదా?’’ అడిగాడు విఠల్.

నిజానికవి నాగేంద్ర ఎప్పుడూ చూడడు. పట్టించుకోడు. అయినా అవునవునంటూ గట్టిగా తలాడించేశాడు.

‘‘అయినా సరే పట్టుమని పదిమంది రాలేదంటే ఏమనుకోవాలి? నీలాంటి బాధ్యత గల సిటిజన్స్ రోజు రోజుకీ కరువైపోతున్నారు’’ అతడ్ని ఎత్తేశాడు.

పొడిగా నవ్వి, మరి బాగోదని తనూ మాటల గోదాలోకి దిగిపోయాడు. ‘‘నాదేముందండీ పిపీలికాన్ని. మీరు మీ వ్యాపారాల్ని లాభాల్ని ఇంటి పనుల్ని అన్నీ పక్కనపెట్టి రాత్రీ పగలూ మా కాలనీ వెల్ఫేర్ గురించే ఆలోచిస్తున్నారు. అహరహం శ్రమిస్తున్నారు. మీలాంటి గ్రేట్ పెర్సన్ మా కాలనీ నాయకుడిగా వుండటమే మా అదృష్టం’’

విఠల్ లోలోన పొంగిపోయాడు కాని ఆ ఆనందాన్ని బహిరంగపర్చలేదు.

‘‘అంతా నీ అభిమానం నాగేంద్రా. ఏదో తిన్నాం పడుకున్నాం అంటే కాదు కదా. తోటివాడికి సాయపడాలి. అందరి మంచీ కోరుకోవాలి. ఊరిబాగే మన బాగు అనుకోవాలి. నేనలా అనుకుంటాను గనుకే ఏ సమస్యనీ వదిలిపెట్టను. ఇంకో ఆర్నెల్లలో ఎన్నికలు రాబోతున్నాయి గనుక ఇప్పుడెళ్ళి మన సమస్యలు చెబితే ఠక్కున పనులవుతాయనేగా ఇవాళ ముహూర్తం పెట్టిందీ!’’

అంతా అవునంటూ తలలూపితే నాగేంద్ర ఒక్కడూ తప్పట్లు కొట్టాడు. దాంతో మిగతా వాళ్ళూ చేతులు కలిపారు.

*‘నువ్వెప్పుడేం చేస్తావో నాకు తెలీకపోతేగా! మొన్న ఎమ్మెల్యేగారి జన్మదినం నాడు విరాళాలు పోగుజేసి ‘జననేత’ అంటూ కాలనీ నిండా ఫ్లెక్సీలు కట్టావు. ఎమ్మెల్యే ఫోటోతో బాటు నీ ఫోటో కూడా పెద్దగా ప్రముఖంగా వేసుకున్నావు. ఎన్నికల ముందూ, ఎన్నికల్లోనూ ఇలా హడావిడి చేసి వచ్చే ఎన్నికల్లో కార్పొరేటర్ సీటు కొట్టేయాలన్నది నీ ప్లాన్. నీ నాటకాలూ, నీ చెంచాగిరీ తెలీని వారెవరూ!’* నాగేంద్ర అనలేదు, ‘అంతరంగం’లో అనుకున్నాడు!

దారేపోతున్న వాళ్ళనింకో పదిమందిని పోగేశాడు విఠల్. అంతా కలిసి పొలోమంటూ ఎమ్మెల్యే గారింటి కెళ్ళారు.

తను తెచ్చే ‘కూర’ కోసం ఇంట్లో భార్య ఎదురు చూస్తుంటుందని నాగేంద్రకు గుర్తుంది. అయినా మరచిపోయినవాడిలా వుండిపోయాడు.

వీళ్ళెళ్ళిన అరగంటకి అతి కష్టం మీద భారీ కాయాన్ని ఈడ్చుకుంటూ వచ్చి సోఫాలో కూలబడ్డారు ఎమ్మెల్యేగారు.

‘ వీడో వెధవ. పరమ లుచ్చా. వీడి ముందు చేతులు కట్టుకుని నిలబడాల్సొచ్చింది ఖర్మ! మొన్న మొన్నటి వరకూ పారిశుధ్య పనుల కాంట్రాక్టర్.  తక్కువ మంది పని వారిని పెట్టి, ఎక్కువ మంది వున్నట్టు బినామీ పేర్లు రాయించి ఆ జీతాలు బొక్కి పెద్దవాడయ్యాడు. కొందరికి కమీషన్లూ  మరి కొందరికీ వాటాలూ ఇచ్చి సత్సంబంధాలు పెంచుకుని కార్పొరేటర్ అయ్యాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసి, పార్టనర్ని ముంచి, కోరలు చాచాడు. తర్వాత ఏకంగా ఎమ్మెల్యే అయిపోయాడు. 30% కమీషన్ ఎమ్మెల్యేగా ఖ్యాతిగాంచాడు. ఆస్తులతోబాటు అంతస్తులూ ఒంటి బరువు బాగా పెంచుకున్న ఒకటోరకం దగుల్బాజీ!’ ఇదీ నాగేంద్ర ‘అంతరంగ’మే!

విఠల్ చేతులు నలుపుతూ అన్నాడు. ‘‘మీ బర్త్‌డేకి ఫ్లెక్సీలు కట్టాం. గుళ్ళల్లో మీ పేరున అభిషేకాలు చేయించాం. పేదలకు అన్నదానం చేశాం. మీరు మాకోసం మా కాలనీ అభివృద్ధి కోసం ఎన్నో చేశారు. అసలు మా అభివృద్ధికి ఏకైక కారణం మీరే. మిమ్మల్ని మళ్ళీ గెలిపించుకుని మీ ఋణం తీర్చుకుంటాం’’ భక్త హనుమాన్ అయిపోయాడతడు.

‘‘అవుననుకో. చేయాల్సినవీ చేద్దామనుకున్నవీ ఇంకా చాలా ఉన్నాయి. అన్నీ చేసేస్తాను. నేను కోరేది ఒక్కటే. చేసిన మేలు మర్చిపోకండి. నా గురించి ప్రతిపక్షం వాళ్ళు చేస్తున్న అబద్ధపు ప్రచారాన్ని గట్టిగా ఖండించండి. నమ్మొద్దని జనానికి నచ్చచెప్పండి’’

''ఇంక ఆ పని మీదే ఉంటాం. మీరు నిశ్చింతగా వుండండి. మరి.. మా కాలనీలో కొన్ని సమస్యలు అపరిష్కృతంగా వుండిపోయాయి. జనం ఇబ్బంది పడుతున్నారు. వాటి మీద మీరోక్షణం దృష్టిపెడితే చాలు అన్నీ పటాపంచలైపోతాయి...'' నవ్వుతూ మహజరు అందిచ్చాడు విఠల్.

అనుచరులు సెల్‌ఫోన్లు క్లిక్‌మనిపించారు.

తద్దినం పెట్టినవాడి తమ్ముళ్ళలా నాగేంద్ర తదితరులు అతడి పక్కన నిలబడి ఫొటోలు దిగారు. అంతా కలిసి, 'మీరు లుక్కేస్తే చాలు మా జన్మ ధన్యమైపోతుందన్నంత' బిల్డప్ ఇచ్చారు.

''సరేనోయ్. నీ పేరేంటన్నావ్... విఠల్...విఠలూ మీరంతా వచ్చి అడిగేక చెయ్యకుండా ఎలా వుంటాను. ఇక మీ పనులు అయిపోయినట్టేనని భావించండి. ప్రతిపక్షం వారి అవాకులకూ చవాకులకూ తగిన విధంగా సమాధానం ఇస్తారుగా. లేకపోతే రేపటి ఎన్నికల్లో గొంతులో చేప ముల్లులా దిగుద్ది....''

''అలాగలాగే సార్. మిమ్మల్ని వదిలెయ్యం'' అని బిగ్గరగా చెప్పి, ''నన్ను గుర్తుపెట్టుకోండి సార్. నా చెయ్యి వదిలెయ్యకండి సార్'' అని మెల్లగా అన్నాడు విఠల్.

అతడి వంక చిత్రంగా చూశాడు నాగేంద్ర. కాని నోరు విప్పలేదు!

**రెండవ రంగం:**

''పదీ పది అయింది నాగేంద్ర ఇంకా రాలేదేంటి? మరీ ఇన్‌డిసిప్లిన్డ్ అయిపోతున్నాడు. ఫోన్ చేయండి. ఎక్కడున్నాడో కనుక్కోండి. ఉన్నపళాన నా ముందుకు రమ్మని చెప్పండి!

ఆఫీసర్ కూర్మావతారం చిందులు తొక్కుతోంటే, ''ఇదిగో వచ్చేశాను సార్'' అంటూ ప్రవేశించి, ''దారిలో బండి ట్రబులిచ్చింది'' అడక్కుండానే సంజాయిషీ ఇచ్చేశాడు నాగేంద్ర.

''నీ సిన్సియారిటీ నాకు తెలుసుగా. పర్మిషన్ తీసుకోకుండా ఒక్కనాడూ లేటవ్వవ్...''

వెర్రిగా నవ్వాడు నాగేంద్ర. రమ్మని సైగ చేసి తన రూంలోకి దారితీయగా అనుసరించాడు.

బ్రీఫ్ కేసు లోంచి ఒక ఫైలు బయటికి తీశాడు కూర్మావతారం. ''ఇది చాలా కాన్ఫిడెన్షియల్ ఫైలు. ఈ ఆఫీసులో నమ్మదగిన వ్యక్తివి నా దృష్టిలో నువ్వొక్కడివే. అంచేతే ముఖ్యమైనవన్నీ ప్రత్యేకంగా నీకే అప్పగిస్తుంటాను. అంతా ఏదేదో అనుకోవచ్చు. నేను పట్టించుకోను. నాకు పని ముఖ్యం. గోప్యత ముఖ్యం. దీని సంగతీ ఎవరికీ తెలీకూడదు. పిసరంత అనుమానం రానివ్వకూడదు, తెలిసిందా?

''నా గురించీ నా సిన్సియారిటీ గురించీ మీకంటే ఎవరికీ ఎక్కువ తెలీదు సార్. నిజం చెప్పాలంటే మీరు పరమశివుడూ, నేను మీ ముందు, కాళ్ళు ముడుచుక్కూర్చున్న నందీశ్వరుణ్ణి!'' చేతులు కట్టుకుని అతి వినయంగా చెప్పాడు నాగేంద్ర.

''అందుకే నువ్వు నాకు నచ్చుతావు నాగేంద్రా. చూస్తూవుండు నీకెంత పుష్ ఇస్తానో నిన్నెంతపైకి తీసుకొస్తానో...!''

*‘ఇలాంటి కబుర్లు విని విని నా తల బొప్పి కట్టింది. నా కేమో పైసా ఖర్చులేని పొగడ్తలు! నీకు మాట ఇచ్చిన వాళ్ళకీ నీ కులస్తులకీ ప్రమోషన్లు! గుడినీ గుళ్ళోని లింగాన్నీ ఒక్కసారే మింగేసే నీ గురించెవడికి తెలీదురా ఇడియట్. నేనంటే ప్రత్యేకాభిమానమా! అవును మరి. నేనొక్కడ్నే నీ ‘తిండి’లో ఒక ‘ముద్ద’ ఆశించకుండా పనిచేసేవాడ్ని. మిగతా వాళ్ళైతే సన్నాయి నొక్కులు నొక్కుతారు. సన్నగా గుంజుకుంటారు. నాకా విద్య చేతకాదాయె. అలాగని అరచేతిలో వైకుంఠం చూపించే నీ జాదూతనం తెలీనంత అమాయకుడ్ని కాదోయ్!’* ఇవి నాగేంద్ర ‘అంతరంగం’లోని మాటలు!

‘‘నువ్వు నా మాటలు నమ్మడం లేదు కదూ. అది సహజంలే. క్రితంసారి ప్రమోషన్ నీకే ఇద్దామని గట్టిగా నిర్ణయించుకున్నాను. అవసరమైన ముగ్గులూ పెట్టాను. కాని మన జిల్లా మంత్రిగారు సైంధవుడిలా అడ్డుపడ్డాడు. తన కులపు కుసుమ కుమారికి ప్రమోషన్ ఇచ్చి తీరాలన్నాడు. ఆమె నీ ముందు దిగదుడుపే అయినా, నాకే మాత్రం ఇష్టం లేకపోయినా ఆమెకు ఇవ్వక తప్పింది కాదు. నీకు ప్రమోషన్ ఇవ్వలేకపోయానన్న బాధ నన్ను తొలుస్తూనే వుందోయ్...’’ డైలాగ్ బరువుగా వచ్చింది.

‘‘నేనంటే మీకు సాఫ్ట్ కార్నర్ వుంది. అదే పదివేలు సార్. ప్రమోషన్‌దేముంది. ఇవాళ కాకపోతే రేపొస్తుంది. నా గురించి మీరేం వర్రీ కాకండి సార్. క్రితంసారి నాకు ప్రమోషన్ ఇవ్వకపోవడంలో మీ తప్పు అస్సల్లేదు సార్. అంతా నా బ్యాడ్‌లక్. అదే అడ్డుపడింది. అందుకే వచ్చే శనిత్రయోదశినాడు మందపల్లి వెళ్ళి శనీశ్వరుడికి అభిషేకం చేయించి రావాలనుకుంటున్నాను సార్’’

‘‘గుడ్ గుడ్. నీకెందుకు ప్రమోషన్ ఇవ్వలేకపోయానో ఇప్పుడు నాకంతా తేటతెల్లమైపోయింది. ఏదేదో అనుకుంటాం గాని, మన చేతుల్లో ఏమీ లేదు. నీకింకో రహస్యం చెప్పనా. మంచి శక్తులు మంచి చేయడంలో అలసత్వం వహిస్తాయేమో గాని, దుష్టశక్తులున్నాయే అవి ఖచ్చితంగా అడ్డుపడతాయి, ఇబ్బందులు సృష్టిస్తాయి. స్వానుభవంతో చెబుతున్నాను విను’’

‘అలాగాండి’ అన్నట్టుగా చూశాడు నాగేంద్ర. ఎంత నగ్నసత్యం కనుక్కున్నారంటూ చూపుల్తో ప్రశంసించాడు కూడానూ.

‘‘ఈసారి హరిహరాదులు అడ్డుపడ్డా ప్రమోషన్ నీదేనోయ్. మా ఆవిడక్కూడా చెప్పేశాను. ఈసారి నీకివ్వలేదనుకో ఇహ ఆవిడతో వేగలేను...!’’ అని ‘గొప్పగా’ నవ్వి అన్నాడు కూర్మావతారం ‘‘చెప్పేనుగా ఈఫైల్ చాలా క్రిటికల్. బాగా స్టడీ చెయ్యి. పాత నిర్ణయాలు ఖోట్ చేస్తూ దీన్నెందుకు యథాతథంగా అప్రూవ్ చేయాలో వివరిస్తూ నోట్ పుటప్ చెయ్యి. రిజెక్ట్ చేయడానికి చిన్న సందూ ఇవ్వకూడదు. ఫైలు చూసీ చూడగానే నేను కళ్ళు మూసుకుని సంతకం పెట్టేయాలి. నా భావం అర్థమైందిగా. ఇక వెళ్ళు. ఇది పూర్తయ్యేవరకూ మరే ఫైలూ టచ్ చేయకు’’

‘‘అమ్మమ్మ మీరింతగా చెప్పాలా సార్ . అన్నీ పక్కన పడేసి మరీ దీని మీద కూర్చోనూ!’’

‘‘గుడ్...’’ రిలాక్సయ్యాడు కూర్మావతారం.

సీట్లో కొచ్చి కూర్చుని వాటర్ బాటిల్ ఎత్తి తాగాడు నాగేంద్ర.

''గురుడు నీళ్ళు తాగిపించినట్టున్నాడేంటి కథ?'' కోలిగ్ అడిగాడు.

''అహ. అలాంటిదేం లేదు'' పొడిగా నవ్వాడు.

మిగతా కోలిగ్స్సు వచ్చారు. నాగేంద్ర వంక ఈర్ష్యగా చూశారు.

''బరువైన ఫైల్సన్నీ బాస్ నాగేంద్రగారికే ఇస్తాడు'' ఒకరు వ్యాఖ్యానించారు.

''నాగేంద్ర గారికి రూల్సన్నీ కంఠోపాఠం. ఎక్కడ నొక్కాలో ఎక్కడ తేల్చాలో ఎక్కడ మొట్టాలో ఎక్కడ మెచ్చుకోవాలో అన్నీ క్షుణ్ణంగా తెలుసు'' వివరణ ఇస్తున్నట్టుగా చెప్పి వంకరగా నవ్వారొకరు.

''ఎన్ని చేస్తే ఏం లాభం. ప్రమోషన్ ఇవ్వలేదు. ఊరిస్తూనే వున్నాడు పాపం!''

''కైండ్ గాకపోయినా క్యాష్‌గా ముట్టజెప్పుంటాడులే!''

''ఆయనకీ ఇతగాడికీ జోడీ కుదిరింది. మధ్యలో మనకెందుకూ!''

''మనం ఎంత గింజుకున్నా ఎంగిలి చెయ్యీ విదపరన్నది నగ్నసత్యం!''

''ఎవరి వాటా ఎవరు తగ్గించుకుంటార్లే. ఇప్పుడు వాళ్ళ టైమ్ నడుస్తోంది. అనుభవించనీ!''

ఎన్ని కామెంట్లు వచ్చి గుచ్చినా, ఎంత కవ్వించినా వారి ట్రాప్‌లో పడలేదు నాగేంద్ర. తల వంచుకుని ఫైల్లో మునిగిపోయాడు.

'*మీరంతా నన్ను చూసి కుళ్ళుకుంటున్నారని తెలుసు. మన బాసుదేవుడు నైవేద్యం పూర్తిగా తనే ఆరగించేస్తాడు. మీరనుకుంటున్నట్టు మాంసం తినేసి బొమికలు నాకు విసరడు. ఇలా అని నేను చెప్పినా మీరు నమ్మరు. ఆయన నన్ను దోస్తు అంటాడు. మీరేమో ద్రోహి అంటారు. నేనేమీ కొరకనని, ఎంగిలీ చేయనని, బయటెక్కడా కక్కనని బాసుదేవుడి నమ్మకం. మీకూ వాటా పంచొచ్చు కదా అన్నది మీ కుళ్ళు. మధ్యలో రెంటికీ చెడిన రేవడిని నేను!*' నాగేంద్ర 'అంతరంగం' వాపోయింది!

**మూడవ రంగం:**

ఉసూరుమంటూ ఇంటికెళ్ళాడు నాగేంద్ర.

కాంతం ముఖం ముటముటలాడుతోంది. 'చెప్పిందేదైనా తేవడం మర్చిపోయానా!' ఆలోచనలో పడ్డాడు.

కూతురు మంచినీళ్ళు తెచ్చిచ్చింది. ఒక్క గుక్కలో తాగేశాడు.

మోడల్ ఎమ్సెట్ రిజల్ట్స్ చేతిలో పెట్టింది.

''చాలా గొప్ప ర్యాంక్ వచ్చింది తల్లీ. నువ్వు ముమ్మాటికీ చదువుల సరస్వతివే'' మెచ్చుకుంటూ తల నిమిరాడు.

''సిటీలోని మా అన్ని క్యాంపస్‌లకీ కలిపి పెట్టిన టెస్ట్ డాడీ. పబ్లిక్ ఎగ్జామ్‌లో అయిదొందల్లోపు ర్యాంకు ఖాయం అంటున్నారు మా ప్రిన్సిపాల్''

ఆనందం, భయం రెండూ  ఒక్కసారే గుండెల మీదెక్కి నర్తిస్తోంటే , ‘‘ఇక నాబిడ్డ డాక్టరైపోయినట్టే. నా ముసలితనంలో రోగాలూ రొచ్చులూ వస్తాయన్న భయంలేదు’’ అన్నాడు.

‘‘ఇదంతా మీ ప్రోత్సాహ ఫలితమే డాడీ. చిన్నప్పట్నుంచీ నన్నెంతో ఎంకరేజ్ చేస్తూ వచ్చారు’’

‘‘నేను కాదు తల్లీ. నీ ప్రతిభే నీకు అడుగడుగునా రాజమార్గం ఏర్పరిచింది...!’’

‘‘అబ్బని కూతురూ, కూతుర్ని అబ్బా వూరికే పొగిడేసుకుని చంకలు గుద్దుకోకండి. ఇవాళ రేపు ఫ్రీ సీటు అయినా పెద్ద మొత్తమే ఫీజు కట్టాల్సొస్తోంది. ఇహ ల్యాబ్ ఖర్చూ బుక్స్ ఖర్చూ అంటూ చాలానే గుంజుతున్నారట. పింగులు ఎక్కడ్నుంచి తెస్తారో కనుక్కోవే పిచ్చి మొహమా!’’ ఈసడింపుగా అంది భార్య కాంతం.

‘‘నీకేం నగలు కొనకుండా ఆంతా మా చదువులకి ఖర్చు పెడుతున్నారని నీకు కుళ్ళు. నువ్వెన్ని పుల్ల విరుపు మాటలన్నా సరే డాడీ మాకే లోటూ రానివ్వరు. మా డాడీ గ్రేట్’’ మెరుస్తోన్న కళ్ళతో చెప్పింది.

‘‘అన్నింటికీ నేనున్నాగా. మీకే లోటూ రానివ్వను గాని నీ దృష్టి చదువు మీంచి పక్కకు మళ్ళనివ్వొద్దు తల్లీ. వెళ్ళు, వెళ్ళి చదువుకో. ఆల్ ద బెస్ట్’’

తండ్రి మాటలకు పొంగిపోయింది. తల్లి వంక నిరసనగా చూసి వెళ్ళిపోయింది.

కొడుకుని ఉదయం అయిదు గంటలకే లేపి క్రికెట్ నేర్చుకోడానికి స్టేడియంకి తీసుకెళ్తాడు నాగేంద్ర. వాడూ తండ్రి గురించి అలాగే మాట్లాడుతాడు.

అందుకే కాంతం ఒళ్ళు  ఊరికే మండిపోతుంది. ‘‘పిల్లల దృష్టిలో హీరో. కానీ నాకు మాత్రం పెద్ద జీరోలా కన్పిస్తున్నారు! పైన పటారం, లోన లొటారం అని పాపం పిల్లలకు తెలీదు. వాళ్ళింకా మీరేదో నిజంగానే తవ్వి తలకెత్తేస్తారని కలలు కంటున్నారు. మీ నిజరూపం తెలిస్తే పూచికపుల్లలా తీసిపారేస్తారు. ఒకటా, రెండా ఇరవై ఏళ్ళ నుంచి కాపురం చేస్తున్నదాన్ని...!’’

‘‘చూడు కాంతం. నా శక్తి సామర్ధ్యాలు నీకు తెలుసు. నా సంపాదనా తెలుసు. ఇంకో రెండు నెలల్లో అమ్మాయిని మెడిసిన్లో చేర్చాలి. ఆ ఖర్చు భరించడం ఎలాగా అని సతమతమవుతున్నాను. వాళ్ళు నిరాశపడకూడదని ఏదో బిల్డప్ ఇస్తున్నానుగానీ వాస్తవ పరిస్థితి నీకు తెలుసుగా’’ అనునయంగా చెప్పడానికి ప్రయత్నించాడు.

‘‘మీరూరికే కిందా మీదా అయినా, పైనా కిందా అయినా పైసలు రాలవు. బల్ల కింద చేయి పెట్టండి. చకచకా అన్నిట్నీ ఉఫ్‌మని ఊదేయొచ్చు’’

‘‘ఏసీబీకి దొరికితే చిప్పకూడు తినాలి తెలుసా!’’

‘‘మీ ఆఫీసరు అడ్డంగా బొక్కెయ్యడం లేదూ! మీకేం దొబ్బుడాయి! మొన్న అతడి పెళ్లాం పేరంటానికి పిలిచి వజ్రాలహారం వేసుకుని ఎన్ని వయ్యారాలు పోయిందనీ! పాతిక లక్షలయ్యిందని వందసార్లు చెప్పింది తెలుసా!’’

‘‘ఆయన ఆఫీసరే. అర్థం చేసుకోవే!’’

‘‘ఎవరైతే ఏంటి. ఎవరి స్థాయికి తగ్గది వాళ్ళకి దొరుకుతుంది. మనిషికి తినాలన్న యావ వుంటే చాలు ఏదో మార్గం దొరుకుతుంది...’’ ముక్కు చీదుతూ స్వరం పెంచుతోంటే ఆమె వాక్ప్రవాహానికి అడ్డుకట్ట వేయకపోతే ఇంట్లో ప్రశాంతంగా బతకలేననుకున్నాడు. అర్జంటుగా ముఖానికి నవ్వు పులుముకున్నాడు.

‘‘నువ్వు భలే చిత్రమైన దానివి కాంతం నేనేదో శుభవార్త చెబుదామని సరైన సమయం కోసం ఎదురు చూస్తోంటే, నువ్వేకంగా వడగళ్ళ వాన కురిపించేస్తున్నావేంటి!’’ బిగ్గరగా నవ్వుతూ అన్నాడు.

‘‘శుభవార్తా! చెప్పండి చెప్పండి...’’

‘‘మా బాసు ఈ ఏడాది ప్రమోషనివ్వడానికి గాను పై ఆఫీసుకి రికమండ్ చేస్తూ పంపిన లిస్టులో మొదటి పేరు నాదే తెలుసా!’’

‘‘ని...నిజమా!’’

‘‘నీ మీద – కాదులే, నా మీద ఒట్టు. ఇంకో ఆర్నెల్లలో నేను ఆఫీసర్నీ నువ్వు ఆఫీసరు భార్యవీ అయిపోవడం ఖాయం!’’

ముద్దు పెట్టుకున్నంత హడావిడి చేసింది. ‘‘వుండండి. ఇరుగూ పొరుగుకి చెప్పొస్తాను...’’ వెళ్ళబోతే ఆపాడు. ‘‘వద్దొద్దు. నరగోలకి నల్ల రాళ్ళు సైతం బద్దలవుతాయి’’

‘‘అవునదీ నిజమే. ఏమైతేనేం, ఇన్నేళ్ళకి రాహుగండం నుంచి బయటపడ్డారు. ఇక మనదంతా రాజయోగం! మా చిన్న చెల్లెలు ఫ్లాట్ కొనుక్కున్నామని ఇంత క్రితమే ఫోన్ చేసి చెప్పింది. మనమింకా ఇంటి స్థలమే కొనలేదన్న దుగ్ధతో మిమ్మల్ని అనరాని మాటలు అన్నాను. ఏమీ అనుకోకండేం’’ అంది గోముగా.

‘*నాకిది అలవాటేలే. ఆ ప్రమోషన్ రిటైరయ్యేలోగా వస్తుందో రాదోగాని, కొన్నాళ్ళపాటు ఇంట్లో హారతులూ, ప్రసాదాలూ దక్కడం ఖాయం!*’ సంతృప్తి పడింది నాగేంద్ర అంతరంగం!

‘‘పిచ్చిదానా. దానికీ ప్లాన్ రెడీ. ఒక్క మూడు నెలలు ఓపికపట్టు. గేటెడ్ కమ్యూనిటీలో మంచి విల్లా కొనేద్దాం!’’

‘‘లంకె బిందెలు దొరుకుతాయా!’’

‘‘అల్రెడీ వున్నాయే. తవ్వి తీసుకోవడమే తరువాయి’’

ఆమె పరమానందపడిపోతూ సమీపించింది. ‘‘మీరెంత మంచివారండీ. ఇన్నాళ్ళూ నాకు చెప్పలేదేం. అవెక్కడున్నాయి?’’

‘‘మా ఊళ్ళో. మా తాతపేరున మూడెకరాల పొలముంది. దాన్ని మనవలకి చెందాలని రాశాడాయన. అది మిగతా ఉమ్మడి పొలాల మధ్యలో వుంది. విడిగా అమ్మడానికి లేదు. అందులో మనకో భాగం వస్తుంది. దాని పక్కనుంచే కొత్తగా బైపాస్ రోడ్డు వేశారు. అమాంతం పొలం రేటు కోట్లలోకి దూసుకుపోయింది. మొన్ననే కజిన్స్ త్వరలో దాన్ని అమ్మేసి పంచుకుందామని చెప్పారు’’

ఆమె కాళ్ళు నేలమీద ఆనటం మానేశాయి. ''ఎంత గొప్పవార్త చెప్పారండీ'' అంటూ ఇంత పంచదార తెచ్చి నాగేంద్ర నోట్లో పోసింది.

*'పిచ్చిదానా! ఉమ్మడి ఆస్తి గొడవల్లో వుంది. నాన్న అన్నదమ్ములే తేల్చుకోలేకుండా వున్నారు. అది ఎప్పటికి తెములుతుందో! ఇది మా వాటా అని ఎప్పటికీ తేలుతుందో! మేమంతా ఎప్పుడు కలుస్తామో! దాన్ని అమ్మి డబ్బు చేసుకోడానికి ఎన్నేళ్ళు పడుతుందో! అది వస్తుందన్న నమ్మకం నాకైతే లేదు. పోనీ నువ్వైనా పగటికలలు కను!'* ఇది నాగేంద్ర 'అంతరంగ' భావన!

**నాలుగవ రంగం:**

నాగేంద్రకు మిత్రుడు సదానందం ఫోన్ చేశాడు.

''గురూ, టౌన్ హాల్లో నాటక పోటీలు జరుగుతున్నాయని నీకు తెలుసుగా. ఇవాళ మా నాటకం వుంది. నువ్వూ నీ శ్రీమతి, పిల్లలూ అంతా రావాలి. కోలీగ్సునీ, ఫ్రెండ్సునీ పదిమంది నైనా పిల్చుకురా...''

''నీకు తెలీనిదేముంది. సినిమాకైతే పరుగున వస్తారుగాని నాటకానికైతే చప్పరించేస్తారు!''

''అలా అంటే కాదు. ఎలావోలా లాక్కురా. ఇంకో రిక్వెస్ట్. హాల్లో అందర్నీ ఒకే చోట గాక తలో పక్కనా కూర్చోబెట్టు. నా ప్రతి డైలాగుకీ తప్పట్లు కొట్టమని చెప్పు. దెబ్బకి జడ్జెస్ ఇంప్రెస్ అయిపోయి మాకు బెస్ట్ ప్రొడక్షన్, నాకు బెస్ట్ యాక్టర్ అవార్డు ఇచ్చేస్తారు. మర్చిపోకు సుమా!''

''ప్రయత్నిస్తాను...''

''అలా కాదు. నువ్వు తీసుకొస్తున్నావు. అంతే...!''

కాంతం రానంది. మిత్రులూ పెదవి విరిచారు. మరి తప్పక నాగేంద్ర ఒక్కడూ వెళ్ళి రెండో వరుసలో కూర్చున్నాడు. జనం పలచగా వున్నారు. సదానందం అతడిని చూశాడు. నాగేంద్ర తృప్తిపడ్డాడు.

సదానందం చెప్పిన ప్రతి డైలాగుకీ, ఇచ్చిన ప్రతి ఎక్స్‌ప్రెషన్‌కీ – అవి ఎలా వున్నా సరే తప్పట్లు కొట్టసాగాడు. అతడ్ని చూసి మరికొందరూ కొట్టారు. ఇంకొందరు 'సదరు సమాజం వాడా!' అని నాగేంద్ర వంక అనుమానంగా చూశారు. ఎంబరాసింగా వున్నా పట్టించుకోలేదతడు. మిత్రుడిని సంతోషపెట్టడానికే కట్టుబడ్డాడు.

కురుస్తోన్న తప్పట్ల వానకు సదానందం చెలరేగిపోయాడు.

కూతుర్ని వదిలేసి ఓ సినీ నటి మోహంలో చిక్కుకున్న అల్లుడికి రకరకాల నాటకాలాడి బుద్ధి చెబుతున్న మామ పాత్ర ధరించాడు సదానందం.

వాడింత గొప్ప నటుడని నాగేంద్రకూ తెలీదు.

చిత్రమేమిటంటే నిజ జీవితంలో సదానందం భార్యాబిడ్డల్ని గాలికి వదిలేసి ఓ నాటకాలమ్మాయితో రెండో సెటప్ పెట్టాడు! ఆమెతోనే వూరేగుతున్నాడు!

అలాంటివాడు అందుకు విరుద్ధమైన పాత్రలో అమోఘంగా నటిస్తున్నాడు. కాదు రంగస్థలం మీద జీవిస్తున్నాడు!

ఇదెలా సాధ్యమైంది?

గ్రీన్ రూం!

*'అవునదే. రంగులు పూసుకుని, విగ్గులు పెట్టుకుని, రకరకాల డ్రెస్సులు ధరించి సరికొత్త 'పాత్ర'గా గ్రీన్‌రూంలో రూపుదిద్దుకుంటారు. ఆయా పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి స్టేజీ మీద అద్భుతంగా జీవిస్తారు!*

*నేను జీవితంలో నిజపాత్రల్లో జీవించడానికి ప్రయత్నిస్తూ ప్రతిసారీ ఫెయిలవుతున్నాను. ఎంచేత? ఇంటా, బయటా, ఆఫీసులో – ప్రతి చోటా కంటికి కనిపించని గ్రీన్‌రూమ్స్ ఉన్నాయా? అక్కడ సమయ సందర్భాన్ని బట్టి రంగులు పులుముకుని కొత్త 'పాత్ర'గా మారిపోతున్నానా? నటనే జీవితం చేసుకున్నానా? ఎందుకీ జీవితాన్ని రంగస్థలం చేస్తున్నాను? ఏం సాధించాలని? మరేం బావుకోవాలని?'* – ఇదేమీ నాగేంద్ర అంతరంగ మధనకాదు, అతడు తన అంతరంగాన్ని అడుగుతున్న ప్రశ్నలపరంపర!

COMMENTS